ప్రజాశక్తి

ఆదివారం 28 ఏప్రిల్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రాజధాని రైతుల్లో అయోమయం

- అమరావతి ఉద్యమంపై వైసిపి భేఖాతర్
- మేనిఫెస్టోలో మూడు రాజధానులకే నిర్ణయం
- తాను గెలిస్తే విశాఖ నుంచి పాలన అంటున్న జగన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజధాని రైతుల్లో అయోమయం ఏర్పడింది. శనివారం సిఎం జగన్ విడుదల చేసిన వైసిపి మేనిఫెస్టోలో మరోసారి మూడు రాజధానుల ప్రస్తావన చేశారు. అమరావతిని కేవలం శాసన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, విశాఖను పరిపాలన రాజధానిగా ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఫలితాలు రాకపోతే తమ పరిస్థితి ఏమిటన్న అంశంపై రైతుల్లో తర్జన భర్జనలు ప్రారంభమయ్యాయి.

రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములు ఇచ్చిన పరిస్థితి గందరగోళంలో ఉంది. తాము ఇచ్చిన భూములకు రిటర్నబుల్ ప్లాట్లు ఇంతవరకు దక్కలేదు. కాగితాల్లోనే ఈ ప్లాట్లు ఇచ్చినా అభివృద్ధి చేసి ప్లాట్లు అప్పగించలేదు. సిఆర్‌డిఎ చట్టం ప్రకారం మొదటి మూడేళ్లలోనే రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించాల్సి ఉన్నా టిడిపి హయాంలో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి అభివృద్ధి ఆగిపోయింది. 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు నాలుగున్నరేళ్లపాటు మూడు రాజధానులకు వ్యతిరేకంగా, అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలని కోరుతూ రైతులు సుదీర్ఘకాలంపాటు ఉద్యమం నిర్వహించారు. ఈ ఉద్యమంలో అనేక మంది మహిళలు హింసకు గురయ్యారు. రెండుసార్లు పాదయాత్రలు చేశారు. ఉద్యమాన్ని ఢిల్లీ వీధుల వరకు తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఉద్యమ తీవ్రతను రైతులు తగ్గించారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ▶ 2లో

బాలుని మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

- మట్టిలో కూరుకుపోయి దుర్ఘటన
- వేసవి సెలవులకని వచ్చిన సందర్భంలో విషాదం
- ఒకర్ని కాపాడిన స్థానికులు

ప్రజాశక్తి పెదకూరపాడు

వేసవి సెలవులకని మేనమామ ఇంటికి వచ్చిన ఇద్దరు చిన్నారులు కుతూహలం కోసమని నీటి గుంతలతో దిగి మృత్యువాత పడ్డారు. మండలంలోని కన్నెగండ్లలో శనివారం జరిగిన ఘటనపై స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల ప్రకాష్‌కు నలుగురు చెల్లెళ్లు కాగా వీరిలో మూడో చెల్లెలైన నరసమ్మను పెదరకూపాడులోని మేనమామ కుమారుడైన పమిడిపల్లి చినవెంకటేశ్వర్లుకు, నాలుగో చెల్లెలైన హేమమ్మను సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన బుల్లెద్దుల క్రీస్తుబాబుకు ఇచ్చి వివాహం చేశారు. నరసమ్మకు వేణుగోపాల్ (11), శ్రావణి అనే ఇద్దరు సంతానం కాగా హేమమ్మకు ధనూష్ (13), ప్రశాంత్ ఇద్దరు కుమారులున్నారు. వేణుగోపాల్ ▶ 2లో

5 లో

దుగ్గిరాల మండలంలో ప్రచారం

ప్రకృతి వనరు ఇసుకను ఉచితంగా ఇవ్వాలి

సిపిఎం, సిపిఐ అభ్యర్థులు జొన్నా శివశంకరరావు, జంగాల అజయ్‌కుమార్

ఓటేయడం బాధ్యత

- రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి ముఖేష్‌కుమార్ మీనా
- నూతన ఓటర్లతో గుంటూరులో అవగాహన ర్యాలీ
- జాతీయ సగటుకంటే గుంటూరు నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని వెల్లడి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి ముఖేష్‌కుమార్ మీనా.. ర్యాలీ (ఇన్‌సెట్)

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రతి ఓటరు మే 13వ తేదీన జరిగే పోలింగ్‌లో తప్పక ఓటు వేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కోరారు. శనివారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఓటరు అవగాహన కోసం 'లెట్స్ ఓట్' సంస్థ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతతో నిర్వహించిన 3కె వాక్‌లో ముఖేష్ కుమార్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు కేవలం హక్కు మాత్రమే కాదని, బాధ్యత, కర్తవ్యం, నిబద్ధత అని అన్నారు. ఓటు హక్కు వినియోగించటం దేశం పట్ల మన విధి అన్నారు. ప్రభుత్వ పరిపాలనను మార్చేశక్తి ఓటుకు ఉందని, ప్రజల అభిష్టం మేరకే దేశ, రాష్ట్ర పాలనా ఏర్పాటు నిర్ణయించబడుతుందని తెలిపారు. దేశ పౌరులుగా యువతకు కోత్త దృష్టి కోణం ఉంటుందని, దేశ భవిష్యత్తు వారి భుజస్కందాలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. అందుకే ఎన్నికల సంఘం ఎల్లప్పుడు యువతరాన్ని అన్నివిధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల పండుగ యువకుల భాగస్వామ్యం లేకుండా పూర్తి కాదన్నారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల పరిధిలోని దాదాపు 20 నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం దేశంలో నమోదైన సగటు ఓటింగ్ శాతం 68 శాతం కంటే తక్కువుగా ఉందని తెలిపారు. విశాఖ పట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా వుందన్నారు.తీ సందర్భంగా లెట్స్ ఓట్ సంస్థ జాతీయ కన్వీనర్ కె.సుబ్బ రంగయ్యతో కలసి ఎన్టీఆర్ సేడియం వద్ద మొదటిసారి ఓటు హక్కు వినియోగించు కుంటున్న యువతతో 3కె వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. లక్ష్మీపురం, మధర్ థెరిస్సా విగ్రహం సెంటరు, కొరిటెపాడు, వెల్కమ్ హోటల్ మీదుగా తిరిగి ఎన్టీఆర్ స్టేడియం వరకు ప్రదర్శన కొనసాగింది. జిల్లా ఎన్నికలాధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌పి తుషార్ డూడీ, జెసి, మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

వేతనాలివ్వకుంటే 3 నుంచి సమ్మె

నరసరావుపేటలో మున్సిపల్ కార్మికుల నిరసన

వార్త మెయిన్‌లో

బిసి రిజర్వేషన్లను పునరుద్ధరిస్తాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వైసిపి ప్రభుత్వం 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని, టిడిపి అధికారంలోకి రాగానే రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని టిడిపి-జనసేన- బిజెపి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి టిడిపి ప్రజా వేదిక లో బిసి సంఘాల ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే కన్నా లక్ష్మీనారాయణ మాట్లా డుతూ వైసిపి రద్దు చేసిన ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తామని అన్నారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ బిసిలు టిడిపికి అండగా వుంటారని చెప్పారు. టిడిపి నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ బిసిలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అమలు చేస్తామని బిసిలపై దాడులు, దౌర్జన్యాల నుండి రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని చెప్పారు.

రాజధాని రైతుల్లో అయోమయం

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ పార్టీలు అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని స్పష్టం చేశాయి. వైసిపి మాత్రం మూడు రాజధానుల నినాదం కొనసాగిస్తోంది. రైతుల ఉద్యమాన్ని భేఖాతరు చేస్తూ మేనిఫెస్టోలో మూడు రాజధానుల అంశానికి ప్రాధాన్యమిచ్చారు. ఈ పరిణామం రైతులకు మింగుడు పడటం లేదు. రాజధాని మార్పు వల్ల ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించిందని ప్రజల్లో అసంతృప్తి ఉంది. దీని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గాయి. భూముల ధరలు తగ్గి రైతులు కూడా ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కొంటు న్నారు. లావాదేవీలు మందగించాయి.

మేనిఫెస్టోపై పెదవి విరుపులు

సిఎం జగన్ ప్రకటించిన మేనిఫెస్టోలో కొత్తగా చెప్పుకోదగిన హామీలు లేవు. నవరత్నాల పథకాలల్లో స్వల్ప మార్పులు చేశారు. వైసిపి తిరిగి అధికారంలోకి వస్తే మళ్లీ ప్రస్తు తం ఉన్న పథకాలతోనే స్వల్పమార్పులతో అమలు చేస్తామని ప్రకటించారు. తాము గెలిస్తే పింఛన్లను ఏప్రిల్ నుంచి రూ.4 వేలు చేస్తామని టిడిపి ప్రకటించింది. వైసిపి మేనిఫెస్టోలో 2028 వరకు మూడేళ్లపాటు రూ.3 వేలు పింఛను కొనసాగించి చివరి రెండేళ్లురూ.250 చొప్పున 2029 ఎన్నికల నాటికి రూ.3500 చేస్తామని ప్రకటించడంపై వైసిపి కార్యకర్తల్లోనే కొంత నిరాశ కలిగించింది. మరోవైపు మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం హామీపి టిడిపి ఇవ్వగా దీన్ని వైసిపి అసలు పట్టించుకోలేదని ఆపార్టీ నుంచే పెదవి విరుపులు వస్తున్నాయి.

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

పెదకూరపాడులోనే ఐదో తరగతి పూర్తి చేసుకోగా, ధనుష్ అబ్బూరులో 7వ తరగతి పూర్తి చేశాడు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో పిల్లలంతా మేనమామ ఊరైన కన్నెగండ్లకు నాలుగు రోజుల కిందట వచ్చారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ధనూష్, వేణుగోపాల్, ప్రశాంత్ కలిసి కాలనీకి సమీపంలోని పొలాల్లోకి వెళ్లారు. అక్కడ అల్లిపరవు వాగు వద్ద ఉన్న పొలాలకు నీరు నిల్వ చేసుకోవడానికి తవ్విన గుంతను చూశారు. ఇటీవల తాగు అవసరాల కోసం కాల్వలకు విడుదల చేసిన నీరు కొంత ఆ గుంతలో చేరడంతో అందులో ఈత వేసేందుకని దిగారు. అయితే చాలాకాలం క్రితం తవ్విన గుంత కావడం, అప్పటికే అందులో మట్టి చేరి ఉండడంతో కూరుకుపోయారు. దీంతో పెద్దగా కేకలు వేయడంతో సమీపంలోని గేదెల కాపరులు అక్కడికి వచ్చి గమనించగా ప్రశాంత ఒక్కడే కేకలు వేస్తూ కనిపించాడు. దీంతో అతన్ని ఒడ్డుకు లాగారు. ప్రశాంత్ సమాచారం ఆధారంగా మరో ఇద్దరు నీటిలో మునిగిపోయారని తెలుసుకుని మోటార్లను తెప్పించి నీటిని తోడారు. క్రేన్‌ను తీసుకువచ్చి మట్టిలో కూరుకుపోయిన ధనూష్, వేణుగోపాల్ మృతదేహాలను వెలికితీశారు. అనంతర ఇద్దరి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకెళ్లారు.

కోడ్ ఉల్లంఘనలపై 9440796184కు ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేందుకు అనువైన వాతావరణం, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ చెప్పారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన గన్నవరం, మతుకుమల్లి, కంభంపాడు, రాయవరం, జమ్మలమడక తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు. భద్రత ఏర్పాట్లుపై అధికారులకు పలు సూచనలు చేశారు. గతంలో ఆయా గ్రామాల్లో ఎన్నికల రోజున జరిగిన ఘటనలను గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు విలువ గురించి స్థానికులకు వివరించారు. అందరూ తప్పకుండా ఓటేయాలన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే 9440796184 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రజలతో మాట్లాడుతున్న పల్నాడు ఎస్పీ బిందుమాధవ్

సమస్యాత్మక ప్రాంతాల్లో ముందుజాగ్రత్త చర్యలు

ప్రజాశక్తి-తెనాలి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని పట్టణ టు టౌన్ సిఐ ఎ సుధాకర్ అన్నారు. పట్టణ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో ప్రజలతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అల్లర్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటు న్నామని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రజలతో మాట్లాడి, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు సిఐ చెప్పారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహ కరించాలని సత్తెనపల్లి రూరల్ సిఐ ఎం రాజేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి మండలం కొమెర పూడి, గుడిపూడి, పెద మక్కెన, లక్కరాగార్ల పాడు, ధూళిపాళ్ల గ్రామాల్లో పోలీసులు శనివారం కవాతు నిర్వ హించారు. పల్నాడు జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ రాజు,ఏఆర్ డిఎస్పీ గాంధీ ఆధ్వ ర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వ హించారు. ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎస్సీల సంక్షేమానికి పెద్దపీట: పిఆర్‌కె

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎస్సీల సంక్షేమానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైసిపి మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకష్ణారెడ్డి అన్నారు. వైసిపికి మద్దతుగా మాదిగ మహేసన రూపొందించిన పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఆర్‌కె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు ఎస్సీలను చులకన చేసి మాట్లాడారని, ఎస్సీలపై పక్షపాత ధోరణి చూపించారని అన్నారు. సామాజిక వర్గాల మధ్య చిచ్చులు పెట్టే చంద్రబాబునను రాష్ట్రంలోని ఎస్సీ సోదరులందరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎస్సీల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఎస్సీల సామాజిక సారధికారిత కోసం సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఎన్నడూ లేని విధంగా ఐదుగురు ఎమ్మెల్యేలకు క్యాబినెట్లో మంత్రులుగా అవకాశం కల్పించారని చెప్పారు. వైసిపి ప్రభుత్వంతోనే ఎస్సీల సామాజిక సాధికారత సాధ్యపడుతుందన్నారు. మాదిగ మహాసేన అధ్యక్షులు కొరటిపాటి ప్రేమ్‌కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న కౌన్సిలర్ లక్ష్మీ లావణ్య

మారిస్ పేటలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రజక వాలంటీర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మారీస్ పేటలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి తాపానికి దాహార్తినితీర్చే మజ్జిగ, తాగునీటి సదుపాయాన్ని స్థానిక కౌన్సిలర్ పెదలంక లక్ష్మీ లావణ్య శనివారం ప్రారంభించారు. పెదలంక నాగేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావు, వెంకటనాంచారయ్య సహా యంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షులు పోతా ర్లంక ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్విఎస్ సంస్థ ప్రధాన కార్యదర్శి పేటేటి శ్రీనివాస్, శివరామ కృష్ణ, పాతర్లంక శ్రీనివాస్, ఫణిదపు దుర్గ, మోపిదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెదవడ్లపూడి నుండి మంగళగిరికి వెళ్లే రహదారిపై గుడ్ న్యూస్ ప్రేయర్ ఫుల్ మిని స్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ పల్లెకోన ఆధ్వ ర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. సంస్థ జన రల్ సెక్రెటరీ కె.బసవ పున్నయ్య ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎస్సై గరికపూడి వెంకట్రావు చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ప్రవీణ్ సహకారంతో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పి.సాల్మన్ రాజు పాల్గొన్నారు.

అదుపులో జూదరులు.. నగదు స్వాధీనం

ప్రజాశక్తి -నాదెండ్ల: గుట్టు చప్పుడు కాకుండా పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని చందవరం గ్రామ పొలాలలో కోళ్ల ఫారం వద్ద శనివారం చోటు చేసుకుంది. పేకాట సమాచారంపై నాదెండ్ల పోలీస్ సిబ్బందితో దాడి చేసినట్లు నాదెండ్ల పోలీసులు తెలిపారు. కోతముక్క ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసు కుని, వారి వద్ద నుంచి రూ.25,610 నగదు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాల్లో స్వల్పంగా పెరుగుదల

జిల్లాలో 17,91,543 మంది ఓటర్లగానిర్ధారణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఈ నెల 15 వరకు ఓటర్లుగా చేరేందుకు తుది అవకాశం ఇవ్వడంతో ఇప్పటి వరకు సమర్పించిన దరఖాస్తులో ఆమోదించిన తరువాత దాదాపు 10 వేలమంది ఓటర్లు కొత్తగా చేరారు. ఈనెల 20న ప్రకటించిన జాబితా కన్నా శనివారం రాత్రి ప్రకటించిన జాబితాల్లో సంఖ్య స్వల్పంగా మార్పులు జరిగాయి. ఈమేరకు అధికారులు తుది జాబితా ప్రకటించారు. ఈనెల 15 వరకు నమోదు అయిన ఓటర్ల జాబితాల్లో వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,91,543 మంది ఉన్నారు. వీరిలో 8,65,377 మంది పురుషులు, 9,26,007 మంది మహిళలు, 159 మంది థర్డ్ జండర్ ఉన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 2,92,432 మంది ఓటర్లతో ఉమ్మడిజిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో 2,78,158 మంది ఓటర్లతో గుంటూరుపశ్చిమలో ఉంది. తాడికొండ 2,07,615, పొన్నూరు 2,27, 135 మంది, తెనాలి 2,67,624, ప్రత్తిపాడు 2,67,888 మంది, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 2,50, 691 మంది ఉన్నారు.

మళ్లీ గెలిపిస్తే రూపురేఖలు మారుస్తా : శంకరరావు

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని మన్నె సుల్తాన్‌పాలెం, ఎమ్మాజీగూడెం, పాపాయి పాలెం గ్రామాల్లో పెద కూరపాడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గంలో రూ.27 కోట్లతో ఆస్పత్రులను, రూ.83 కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేశామని చెప్పారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించామన్నారు. తాము చేసిన అభివృద్ధిలో గత టిడిపి ప్రభుత్వం కనీసం పదోవంతయినా చేయలేదన్నారు. ప్రతి రోడ్డునూ బాగు చేశామని, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల రూపురేఖలు మార్చేలా కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మించబోతున్నామని అన్నారు. పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి నీళ్ల తెచ్చి అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు తాగునీరు, సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. చంద్రబాబు మాటలకు మోసపోకుండా వైసిపికి ఓటేయాలని కోరారు. తనతోపాటు నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలన్నారు.

'గీతాంజలి' విద్యార్థుల అభినందన సభ

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో పదో తరగతి విద్యార్థుల అభినందన సభ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా డిప్యూటీ డిఇఒ వేణుగోపాల్, వినుకొండ అర్బన్ సీఐ సాంబశివరావు, నరసరావుపేట సింధు స్కూల్స్ అధినేత రామకృష్ణ పాల్గొన్నారు. పది ఫలితాల్లో టౌన్ ఫస్ట్ సాధించిన బి.వర్షితతోపాటు 500కు పైగా సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ ఇంటర్ చదవబోతున్న విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగాలని, జీవితంలో పురోభివృద్ధి సాధించాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గీతాంజలి స్కూల్స్ కరస్పాండెంట్ వైఎల్ కిషోర్, ప్రిన్సిపల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పొన్నూరు

ఆసుపత్రులు, భవనాలు, విద్యాసంస్థలలో అగ్ని ప్రమాదాలు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు యాజమాన్యం, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పొన్నూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ప్రసాద రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఫైర్ స్టేషన్ సిబ్బంది డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఎలక్ట్రికల్ వైర్లు షార్ట్ అయినప్పుడు అగ్ని ప్రమాదాలు ఎలా నివారించాలని అంశంపై ఆసుపత్రి, అధికారులు, వైద్యులు సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొన్నూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ రేష్మ, డాక్టర్ ఫిరోజ్ ఖాన్ సహా వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు యువనేత నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఉండవల్లి నివాసంలో పశ్చిమ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గళ్లా మాధవి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి యువనేత పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అయిదేళ్ల జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించు కునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున నాయకులు తరలివచ్చి టిడిపిలో చేరుతున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు నేతృత్వంలో పని చేయడానికి కలిసి వచ్చే వారందరికీ పార్టీ ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు.

పార్టీలోకి కొత్తగా వస్తున్న నేతలు రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కషిచేయాలని, వారందరికీ అధికారంలోకి వచ్చాక తగిన గుర్తింపునిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో



లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరిన కార్పొరేటర్ హనుమాయమ్మ

తెలుకుట్ల హనుమాయమ్మ (19వ డివిజన్ కార్పొరేటర్), సాదు ఉమామహేశ్వరి (23వ డివిజన్ కార్పొరేటర్), వైసిపి జిల్లా మైనారిటీ నాయకులు ఎస్.కె మహబూబ్ బాషా (టెంట్ హౌస్ బాబు), ఎస్ కె బాషా (19వడివిజన్ వైసిపి అధ్యక్షుడు), తుమ్మల నాగేశ్వరావు (30వడివిజన్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో సాదు రాజేష్, తేలుకుట్ల యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమృతరావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నాజ్ సెంటర్‌లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధకులు తమనంపల్లి అమృతరావు 35వ వర్థంతి నిర్వహించారు. అమృతరావు మనవడు అమృతరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రిటైర్డ్ చీఫ్ మేనేజర్ రవిశంకర్ పాల్గొని అమృతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ అమృతరావు తాడికొండ శాసన సభ్యుడిగా పనిచేస్తూ, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీతో పోరాడి, ఆంధ్రా ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ద్వారా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఆవిర్భావానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఒబి ఆలిండియా ఎస్సీ, ఎస్టీ

అమృతరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రవిశంకర్

ఎంప్లాయీస్ అఖిల భారత కోశాధికారి పిల్లి శ్రీనివాసరావు, ఎపి ఇన్‌ఫ్రా ఇన్నోవేషన్స్ అధ్యక్షులు దొడ్డా నాగరాజు, పిల్లి సునీల్, ఎన్.ప్రసాద్, దళిత ఉద్యమ నాయకులు దొడ్డా ప్రసాద్, జి.వందనం పాల్గొన్నారు.

కరోనాతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - వినుకొండ

కరోనా విపత్కర పరిస్థితులలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వినుకొండ జర్నలిస్టుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కరోనాతో మృతి చెందిన జర్నలిస్ట్ ఉప్పు మస్తాన్‌రావు 3వ వర్ధంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం వర్ధంతి సభ నిర్వహించారు. మస్తాన్‌రావు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ కరోనా సమయంలో విధులు నిర్వహిస్తూ

రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది జర్నలిస్టులు మృతి చెందారని, ఆ కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని అన్నారు. జర్నలిస్టులకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం మెరుగు పరచాలని కోరారు. కార్యక్రమంలో ఆచారి, వై.రామ్మోహన్‌రావు, మల్లికార్జున, టి.శ్రీనివాస రావు, మహేష్, ఎల్.వెంకట్రావు, పి.దుర్గాప్రసాద్, జి.కోటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మణ్, పివి సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చదలవాడ అరవిందబాబు

గెలిపించి సేవ చేసే అవకాశం ఇవ్వండి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : టిడిపి ద్వారానే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చిన తనకు ఒక అవకాశం ఇవ్వాలని ఎన్‌డిఎ కూటమి తరుపున నరసరావుపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని 13,14 వార్డుల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గంలో టిడిపి అధికారంలో ఉండగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమి లేదన్నారు. ప్రచారంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, కపలవాయి విజయ్ కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్), మంగళగిరి.

ఓ.యస్. నెం. 315/2021

బిట్వీన్ :

పఠాన్ రహీం .... వాది

మరియు

షేక్ నాగుల్ మీరా ... ప్రతివాది

టు : షేక్ నాగుల్ మీరా, తండ్రి : షేక్ మౌలాలి, డోర్ నెం. 25-18-78, 9వ లైన్, 2వ క్రాస్‌రోడ్, ఐ.టి.సి.కి ఎదురుగా, గుంటూరు, గుంటూరుజిల్లా.

పై నెంబరు దావాలోని ప్రతివాదిపై వాది ప్రాంసరీ నోటు నిమిత్తం దావా దాఖలు చేసియున్నాడు. పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారు ప్రతివాదికి ఎన్ని పర్యాయములు దావా సమన్లు జారీ చేసిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ప్రతివాది అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా ది. 6-5-2024వ తేదీనకు వాయిదా ఇచ్చియున్నారు. సదరు తేదీన మీరు పై తెలిపిన కోర్టుకు ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనిపక్షంలో మీ పరోక్షమున తీర్మానింపబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

ఇట్లు

రేటూరి కిషోర్,

వాది తరపు న్యాయవాది,

మంగళగిరి.

మంగళగిరి.

తేది : 20-4-2024

సెల్ : **98481 68449**



చెక్కు అందచేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్‌బిఐ బీమా చెక్కు

ప్రజాశక్తి-గుంటూరు

పోలీసు శాఖ ఉద్యో గులు అందరూ వారి జీతాలకు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇం డియా అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బిఐ డిజిఎం ఎం.శరత్‌రాజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహించే కానిస్టేబుల్ సిహెచ్.శ్రీనివాసరావు ఈ ఏడాది జనవరి 16న గుండె పోటుతో మృతి చెందారు. ఆయన జీతానికి సంబంధించిన బ్యాంక్ ఖాతా బ్రాడీపేట లోని ట్రెజరీ శాఖలో ఉంది. ఈ క్రమంలో ఎస్‌బిఐ అందించే పోలీసు శాలరీ ప్యాకేజి బీమా క్లెయిమ్ కింద రూ.5 లక్షలు, ప్రత్యేక బీమా కింద రూ.కోటి, సురక్ష హోమ్ లోన్ కింద రూ.6.11 లక్షల చెక్కును బ్రాడీపేట శాఖలో శ్రీనివాసరావు భార్య పద్మజా, కుమారుడు సాయితేజకు శరత్‌రాజ్, రీజనల్ మేనేజర్ ఫణికొండలరావు అందించారు. కార్యక్రమంలో ట్రెజర్ శాఖ చీఫ్ మేనేజర్ ఎం.అమరేంద్ర, డిఎం షేక్.బషీర్ అహ్మద్, లైఫ్ మేనేజర్ వై.యుగంధర్ పాల్గొన్నారు.

పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులుగా సయ్యద్ జిలాని

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విశాఖ జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి జనసేన పార్టీ ఎన్నికల పరిశీలకులుగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నరసరావుపేట ఇన్‌ఛార్జి సయ్యద్ జిలానిని నియమిస్తూ జన సేన అధినేత పవన్ కల్యాణ్ ఉత్తర్వు లిచ్చారు. నరసరావుపేట మండలం లోని పమిడిపాడుకు చెందిన జిలాని జనసేన ఆవిర్భావం నుండి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. అధి ష్టానం ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

పవన్ కల్యాణ్‌తో సయ్యద్ జిలాని

CHANGE OF NAMES

I, GEETHA RAGHAVENDRA (Old Name), D/o Murthy Veeranna Narasimha, Resident of D. No.5-6, 5th Ward, Kurubarapalli, Muthukur Post, Gudibanda Mandal, Anantapur-515271, Andhra Pradesh, India. Hence, I have changed my name to **GEETHA NARASIMHA MURTHY** (New Name) hereafter my name is known as **GEETHA NARASIMHA MURTHY** (New Name).

Before The Honourable Deputy Registrar of Chits at Ongole

(Application for reference of a Dispute)

Dispute No. 16 of 2024

M/s. Sri Sai Anjana Chit Funds India Pvt., Ltd.,
Rep.by its Foreman / Branch Manager, Ongole ... Disputant.

Versus

1. **Rajanala Venkata Rajeev Reddy**
and another ... Opponents.

Notice

To,
Opp-1. **Rajanala Venkata Rajeev Reddy,** S/o **Edukondala Reddy,** Occ: Business, Resident at D.No.04-122-02, Rami Reddy Palem Village, Rampicharla Mandal, Guntur District, Present Resident at D.No.56-05-7F, Satya Sai Apartments, Patamata Remineni Vari Street, High School Road, Vijayawada.
Opp-2. **Annala Dasu Subba Rao,** S/o **Jesu Rathnam,** Occ: Secondary Grade Teacher, M.P.P School, Narasanayunipalem Village, Vinukonda Guntur District. Resident at D.No.33-03/03 Sanjeeva Nagar, Chilakaluri Peta, Guntur District.

పై నెంబరున డిస్‌ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, ఒంగోలు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసునిమిత్తం **తే17-05-2024**దికి వాయిదా వేసియు న్నారు.కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగాగానీ లేదా వకీలు ద్వారాగానీ పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, ఒంగోలు వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపు కోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

కాకి నాగరాజు, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
డిస్‌ప్యూటెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **96406 49847**

ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు జిల్లా
పల్నాడు జిల్లా

పల్నాడులో తొలుత కమ్యూనిస్టులదే హవా

కోలా సుబ్బారెడ్డి

మందపాటి నాగిరెడ్డి

పులుపుల వెంకట శివయ్య

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

భారత స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో పల్నాడులో తొలత కమ్యూనిస్టులే ఆధిపత్యం సాధించారు. ఆంధ్రప్రదేశ్ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో భాగంగా ఉండేది. 1952లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ఇప్పటి గురజాల, మాచర్ల శాసనసభ నియోజకవర్గాలు కలిపి ఒకటే పల్నాడు నియోజకవర్గంగా ఉండేది. ఆ ఎన్నికల్లో పల్నాడు నియోజకవర్గం నుండి కాంగ్రెసు అభ్యర్థిగా కాసు బ్రహ్మానందరెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా కోలా సుబ్బారెడ్డి పోటీ చేశారు. ఇరువురూ కూడా భారత స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్నవారే. సుబ్బారెడ్డితో పోల్చితే కాసుబ్రహ్మానందరెడ్డి పేరెన్నికగల నాయకుడు. స్థానిక ప్రజా ఉద్యమాలు, హక్కుల కోసం పోరాటం చేసే ఉద్యమనాయకుడుగా సుబ్బారెడ్డికి మంచి పేరు ఉంది. ఇరువురు కూడా పల్నాడు నియోజకవర్గం నుంచి హోరా హోరీగా తలబడ్డారు. మార్చి 27న పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 66,235 ఓటర్లు ఉండగా 35,916 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 54.23 శాతం పోలింగ్ నమోదు అయింది. కోలా సుబ్బారెడ్డికి 18,734 ఓట్లు రాగా, కాసు బ్రహ్మానందరెడ్డికి 7,088 ఓట్లు వచ్చాయి. సుబ్బారెడ్డి చేతిలో 11,646 ఓట్లు తేడాతో బ్రహ్మానందరెడ్డి ఓడిపోయారు. అన్ని వనరులను ఉపయోగించుకున్న కాసు బ్రహ్మానందరెడ్డి సుబ్బారెడ్డికి వచ్చిన ఓట్లలో సగం కూడా తెచ్చుకోలేక 32.43 శాతం ఓట్ల తేడాతో ఘోర పరాజయం పాలయ్యారు. పైగా సుబ్బారెడ్డి ఎన్నికల్లో పైసా ఖర్చు పెట్టకుండానే అఖండ విజయం సాధించారు.

ఉమ్మడి మద్రాసు నుంచి రాష్ట్రం విడిపడిన అనంతరం 1955లో పల్నాడు నియోజకవర్గం రద్దు కాబడి గురజాల, మాచర్ల నియోజకవర్గాలుగా ఏర్పాడ్డాయి. గురజాల నియోజకవర్గం నుంచి ఆచార్య ఎన్.జి. రంగా సారథ్యంలోని కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థిగా మండవ బాపయ్య చౌదరి, భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా కోలా సుబ్బారెడ్డిలు పోటీ చేశారు. ఫిబ్రవరి11న పోలింగ్ జరిగింది. నియోకవర్గంలో 63,317 మంది ఓటర్లు ఉండగా, 39,301 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాపయ్య చౌదరికి 23,306 ఓట్లు రాగా, సుబ్బారెడ్డికి 15,219 ఓట్లు వచ్చాయి. 8,087 ఓట్ల తేడాతో సుబ్బారెడ్డి పరాజయం పాలయ్యారు.

మాచర్ల నియోకవర్గం నుంచి కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ అభ్యర్థిగా కురుముల రంగమ్మ, భారత కమ్యూనిస్టు పార్టీ తరుపున మందపాటి నాగిరెడ్డి పోటీ చేశారు. నియోజకవర్గంలో 54,095 మంది ఓటర్లు ఉండగా, 29,497 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మందపాటి నాగిరెడ్డికి 10,657 ఓట్లు రాగా, కురుముల రంగమ్మకు 8,386 ఓట్లు వచ్చాయి. 2,271 ఓట్ల మెజార్టీతో నాగిరెడ్డి విజయం సాధించారు. మందపాటి నాగిరెడ్డిది గురజాల నియోజకవర్గంలోని ఇరికేపల్లి గ్రామం. వీరు నడికూడి గ్రామ మునసబుగా పనిచేస్తూ 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, తన ఉద్యోగాన్ని కోల్పోయారు. 1948లో కమ్యూనిస్టు పార్టీతో సంబంధం కారణంగా 3 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. 1953లో నడికూడి గ్రామ సర్పంచిగా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఏకగ్రీవంగా ఎన్నికైయారు. కమ్యూనిస్టు పార్టీలో, వివిధ కార్మిక యూనియన్లలో పనిచేసిన నాగిరెడ్డి నందికొండ(నాగార్జునసాగర్ ప్రాజెక్టు) సాధన ఉద్యమంలో పాల్గొని, ప్రాజెక్టు కమిటి సహాయ కార్యదర్శిగా పనిచేశారు.

1962లో గురజాల నియోకవర్గానికి జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొత్తా వెంకటేశ్వర్లు, భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా కోలా సుబ్బారెడ్డి బరిలో నిలిచారు. ఫిబ్రవరి 19న పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 72,717 మంది ఓటర్లు ఉండగా, 45,500 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 1785 ఓట్లు చెల్లుబాటు కాలేదు. కొత్తా వెంకటేశ్వర్లుకు 21,323 ఓట్లు రాగా, కోలా సుబ్బారెడ్డికి 16,708 ఓట్లు వచ్చాయి. 4,615 తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్వర్లు విజయం సాధించారు.

1972లో గురజాల శాసనసభ నియోకవర్గానికి జరిగిన ఎన్నికలలో, 1955లో మాచర్ల సిపిఐ శాసనసభ్యుడుగా గెలుపొందిన మందపాటి నాగిరెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. 1962, 1967 వరస విజయాలు సాధించిన కొత్త వెంకటేశ్వర్లు హ్యాట్రిక్ విజయం కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మూడోసారి ఎన్నికల బరిలో నిలిచారు. మార్చి 15న ఎన్నికలు జరిగాయి. మొత్తం 92,998 ఓటర్లు ఉండగా 54,467 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 1332 చెల్లుబాటు కాలేదు. సిపిఐ అభ్యర్థి మందపాటి నాగిరెడ్డికి 29,659 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్వర్లుకు 21,282 ఓట్లు వచ్చాయి. 8,377 ఓట్లు తేడాతో నాగిరెడ్డి విజయం సాధించారు.

1978లో జరిగిన గురజాల శాసనసభ ఎన్నికల్లో సిపిఐ తరుపున మందపాటి నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరుపున గడిపూడి మల్లికార్జునరావులు పోటీ చేశారు. ఫిబ్రవరి 25న ఎన్నికలు జరిగాయి. మొత్తం 1,18,197 ఓట్లుకు గాను 83,809 ఓట్లు పోలయ్యాయి. 2002 ఓట్లు తిరస్కరణకు గురిఅయ్యాయి. మల్లికార్జునరావుకు 44,652 ఓట్లురాగా, నాగిరెడ్డికి 21,404 ఓట్లు వచ్చాయి. మల్లికార్జునరావు 23,248 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ తరువాత ఈ నియోజకవర్గంలో సిపిఐ తన ప్రాభవాన్ని కోల్పోయింది.

వినుకొండ నియోజకవర్గంలో ఆధిపత్యం కమ్యూనిస్టులదే

1952లో జరిగిన వినుకొండ అసెంబ్లి నియోజకవర్గ ఎన్నికలలో సిపిఐ తరుపున పులుపుల వెంకటశివయ్య పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి పాలడుగు నాగయ్య చౌదరి పై విజయం సాధించారు. మొత్తం 65,185 ఓటర్లు ఉండగా, 32,079 ఓట్లు నమోదు అయ్యాయి. శివయ్యకు 15,354 ఓట్లు రాగా, నాగయ్యచౌదరికి 4,997 ఓట్లు వచ్చాయి. 10,357 ఓట్లు మెజార్టీతో శివయ్య గెలుపొందారు.

1955లో జరిగిన ఎన్నికలలో సిపిఐ తరుపున పులుపుల వెంకటశివయ్య, కాంగ్రెస్ పార్టీ తరుపున నలబోలు గోవిందరాజులు పోటీ చేశారు. మొత్తం 71,749 ఓటర్లు ఉండగా, 39,861 ఓట్లు పోలయ్యాయి. శివయ్యకు 19,336 ఓట్లు రాగా, గోవిందరాజుకు 20,525 ఓట్లు వచ్చాయి, 1,189 ఓట్ల స్వల్ప తేడాతో శివయ్య ఓడిపోయారు.

1962లో జరిగిన ఎన్నికలలో సిపిఐ తరుపున పులుపుల వెంకటశివయ్య, కాంగ్రెస్ పార్టీ తరుపున భవనం జయప్రధ పోటీ చేశారు. మొత్తం 81,069 ఓటర్ల ఉండగా, 47,293 ఓట్లు పోలయ్యాయి. శివయ్యకు 17,051 ఓట్లు రాగా, జయప్రధకు 12,987 ఓట్లు వచ్చాయి. 4,064 ఓట్ల తేడాతో శివయ్య విజయం సాధించారు.

1972లో జరిగిన ఎన్నికలలో సిపిఐ తరుపున పులుపుల వెంకటశివయ్య, కాంగ్రెస్ పార్టీ తరుపున భవనం జయప్రధ పోటీ చేశారు. మొత్తం 97,250 ఓటర్లు ఉండగా, 54,904 ఓట్లు పోలయ్యాయి. జయప్రధకు 23,968 ఓట్లురాగా, శివయ్యకు 18,192 ఓట్లు వచ్చాయి. 5,776 ఓట్ల తేడాతో శివయ్య ఓడిపోయారు.

1985లో జరిగిన ఎన్నికలలో సిపిఐ తరుపున గంగినేని వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ తరుపున వెంకటనారాయణరావు చంద్ర పోటీ చేశారు. మొత్తం 108,651 ఓటర్లు ఉండగా, 86,394 ఓట్లు పోలయ్యాయి. వెంకటేశ్వరరావుకు 46,994 ఓట్లు రాగా, నారాయణరావుకు 35,118 ఓట్లు వచ్చాయి. 11,876 ఓట్ల తేడాతో వెంకటేశ్వరరావు విజయం సాధించారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి షేక్ దరియావలి నామినేషన్ ఉపసంహరించు కున్నారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వి మురళి తెలిపిన వివరాల ప్రకారం 22 మంది అభ్యర్థులు 38 నామినేషన్లు దాఖలు చేయగా నామినేషన్ల పరిశీలన అనంతరం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. 20 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. వీరిలో నకరికల్లు మండలం గుండ్లపల్లికి చెందిన షేక్ దరియావలీ నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు వి.మురళి తెలిపారు. ప్రస్తుతం 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా రాజేష్ నాయుడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట :టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా మల్లెల రాజేష్ నాయుడిని నియమించారు. శనివారం చిలకలూరిపేటలోని ఆయని నివాసంలో మల్లెల మీడియాతో మాట్లాడారు. శుక్రవారం తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజర పు అచ్చెన్నాయుడు శుక్రవారం లెటర్ ఇచ్చారని తెలిపారుఈ సందర్భంగా టిడిపి నేత నారా చంద్రబాబునాయుడు, లోకేష్, అచ్చన్నాయుడు, ప్రత్తిపాటి పుల్లారావుకు అభినందనలు తెలిపారు. తనకు కేటాయించిన విధులను నిజాయితీగా పని చేసి పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బుక్కాపురం గ్రామ ఉప సర్పంచ్ అల్లం ఆంజనేయులు, 1,3 వార్డు సభ్యులు మిడిదొడ్డి సీతారాములు, అట్లూరి సైదయ్య టిడిపిలో చేరారు.

వామపక్షాల పురిటి గడ్డ మంగళగిరి

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో వామపక్ష పార్టీలు అనేకసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన చరిత్ర మంగళగిరి ఉంది. ఉమ్మడి కమ్యూనిస్టుగా ఉన్నప్పుడు పెదకూరపాడు గ్రామానికి చెందిన దర్శి లక్ష్మయ్య 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థిగా పోటీ చేసి ఆనాటి కృషి కార్ లోక్ పార్టీ అభ్యర్థి ఐ గోవిందరావు పై 17235 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఇప్పటివరకు ఈ మెజార్టీని అధికార పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, వైసిపి, టిడిపి పార్టీలు ఈ నియోజకవర్గంలో అధికమించలేదు. 1955 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున మేక కోటిరెడ్డి పోటీ చేసి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి నూతక్కి వెంకట రంగారావు పై 5086 మెజార్టీతో గెలుపొందారు. 1962 అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా వేములపల్లి శ్రీకృష్ణ పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి తమ్మ రంగారెడ్డి పై 5,146 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తులాబందుల నాగేశ్వరావు పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ విడిపోయిన తర్వాత సిపిఐ, సిపిఎంగా విడివిడిగా పోటీ చేశారు. ఇద్దరు కమ్యూనిస్టు పార్టీల అభర్థులకు 30,000 పైగా ఓట్లు వచ్చాయి. అందువలన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 1972 ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థిగా వేములపల్లి శ్రీకృష్ణ పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థి గుజ్జుల గంగాధర్ రెడ్డిపై 5369 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. సిపిఎం అభ్యర్థిగా సింహాద్రి శివారెడ్డి పోటీ చేసి 17000 తెచ్చుకున్నారు. 19 78 అసెంబ్లీ ఎన్నికల్లో జనతా పార్టీ తరపున సిపిఎం మద్దతుతో గద్దె వెంకటరత్తయ్య పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పై 4033 మెజార్టీతో గెలుపొందారు. 1983 ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున డాక్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరావు పోటీ చేసి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాయపాటి శ్రీనివాసరావు పై విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో సిపిఎం సిపిఐ కలిసి పోటీ చేశాయి. సిపిఎం తరపున సింహాద్రి శివారెడ్డి పోటీ చేసి 16,000 పైగా ఓట్లను ఎన్టీ రామారావు గాలిలో కూడా సాధించగలిగారు. 1985 ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం, పార్టీల బలపరిచిన అభ్యర్థిగా మరల టిడిపి తరఫున ఎన్ఎస్ఎస్ కోటేశ్వరావు పోటీ చేసి సినీనటి జమున కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయారు. 1989లో జరిగిన ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజ కవర్గం నుండి మంగళగిరికి చెందిన గోలి వీరాంజనేయులు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి సిపిఐ, టిడిపి బలపరిచిన సిపిఎం అభ్యర్థిగా సింహాద్రి శివారెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గోలి వీరాంజనేయులు విజయం సాధించారు. సింహాద్రి శివారెడ్డికి 42 వేల ఓట్లు వచ్చాయి. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ, టిడిపి బలపరిచిన సిపిఎం అభ్యర్థిగా నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు పోటీ చేసి14,899 మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి దామర్ల ఉమామహేశ్వరరావు ఓడిపోయారు. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున మురుగుడు హనుమంతరావు పోటీ చేసి విజయం సాధించారు. సిపిఎం తరఫున నిమ్మగడ్డ రామ్మోహన్రావు పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. టిడిపి బలపరిచిన బిజెపి అభ్యర్థి ఎడ్లపాటి రఘునాథ్ బాబు పోటీ చేశారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో మరలా తిరిగి మురుగుడు హనుమంతరావు కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. ఆనాటి ఎన్నికల్లో సిపిఎం తరఫున నిమ్మగడ్డ రామ్మోహన్రావు పోటీ చేసి 34,000 ఓట్లను సాధించారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున కాండ్రు కమల పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం పార్టీలు విడివిడిగా పోటీ చేశాయి. ఇరు పార్టీలకు 50 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి తరఫున పోటీ చేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి టిడిపి అభ్యర్థి గంజి చిరంజీవిపై 12 ఓట్ల తేడాతో ఆళ్ల రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. ఎన్నికల్లో సిపిఐ, సిపిఎం పార్టీలు విడివిడిగా పోటీ చేశాయి. 2019 ఎన్నికల్లో వైసిపి తరఫున పోటీ చేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై 5350 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల్లో సిపిఎం, జనసేన పార్టీలు బలపరిచిన సిపిఐ అభ్యర్థిగా ముప్పాళ్ళ నాగేశ్వరావు పోటీ చేసి పదివేలకు పైగా ఓట్లు వచ్చాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నుండి టిడిపి తరఫున ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోటీ చేస్తున్నారు. వైసిపి తరఫున మురుగుడు లావణ్య పోటీ చేస్తున్నారు. సిపిఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరిచిన సిపిఎం అభ్యర్థిగా జొన్న శివశంకరరావు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా డబ్బుతో గెలవాలని ఉద్దేశంతో అధికార వైసిపి, ప్రతిపక్ష టీడీపీలు ఉన్నాయి.

సిపిఎం తరపున పోటీ చేస్తున్న జొన్న శివశంకర్ గతంలో ఉండవల్లి గ్రామ సర్పంచిగా 20 సంవత్సరాలు పని చేశారు. ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేశారు. ఈ నియోజకవర్గంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. గత చరిత్రలో నాలుగు పర్యాయములు కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులు విజయం సాధించారు. అనేక స్థానిక సంస్థ ఎన్నికల్లో గతంలో సర్పంచులుగా, ఎంపిటీసీలుగా, మున్సిపల్ కౌన్సిలర్ గా విజయం సాధించి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు నియోజకవర్గంలో పేదల తరపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థికి, పోటీగా డబ్బుతోనే ప్రధానంగా గెలవాలని ఉద్దేశంతో నారా లోకేష్, మురుగుడు లావణ్య ఉన్నట్లుగా ప్రజలు అనుకుంటున్నారు. నియోజవర్గ ప్రజలు ప్రజల కోసం పనిచేసే అభ్యర్థి జొన్న శివశంకరరావుకు సహకారం అందించవచ్చునని ప్రజలు భావిస్తున్నారు.

మంగళగిరిలో త్రిముఖ పోటీ!

గెలుపోటములను ప్రభావితం చేయనున్న సిపిఎం అభ్యర్థి

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో ఈ సారి త్రిముఖ పోటీ జరగనుంది. టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి నారా లోకేష్, వైసిపి నుంచి మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు కోడలు మురుగుడు లావణ్య 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి చేతిలో ఐదు వేల పైచిలుకు ఓట్ల తేడాతో లోకేష్ ఓటమి పాలయ్యారు. ఇండియా వేదిక నుంచి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకర్ పోటీ పడుతున్నారు. వామపక్షాలు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ కలసి ఏర్పాటు అయిన ఇండియా వేదిక అభ్యర్థి కూడా ప్రధాన ప్రత్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేయనున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన ఆళ్లరామకృష్ణారెడ్డి ఈ సారిపోటీ చేయడం లేదు. ఆయన స్థానంలో లావణ్య పోటీ చేయడం వల్ల వైసిపి బిసి కార్డును తెరపైకి తెచ్చింది. వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా మారుతుందని టిడిపి అభ్యర్థి లోకేష్ భావిస్తున్నారు. వైసిపి హయాంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జరిగినా అవి ఓట్లు తీసుకువచ్చి పెట్టే స్థాయిలో లేవు. మంగళగిరి, తాడేపల్లిని కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసినా గత ఐదేళ్లుగా నియోజక వర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగలేదు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ఎంటిఎంసి ఏర్పాటైన తరువాత తాడేపల్లి ప్రజల్లో అధికార పార్టీపై అసంతృప్తి నెలకొంది. ప్రతి పనికీ మంగళగిరి వెళ్లాల్సి రావడం, అధికారులు అందుబాటులో లేకపోవడం ఇందుకు కారణంగా ప్రజలు భావిస్తున్నారు. దీంతో పాటు గత ప్రభుత్వం తాడేపల్లి, కొలనుకొండ, కుంచనపల్లికి చెందిన రైతుల పంట పొలాలపై విధించిన యు1 రిజర్వ్ జోన్ వైసిపి ప్రభుత్వం వస్తే తొలగిస్తుందని భావించారు. ఆ మేరకు అపట్లో ప్రస్తుత ముఖ్యమంత్రి దగ్గర నుండి ఎమ్మెల్యే వరకు రైతులకు హామీ నిచ్చారు. సుమారు 134 రోజులు రైతులు దీక్షలు చేశారు. వామపక్షాలతో పాటు జోన్ విధించిన టిడిపి కూడా రైతులకు మద్దతు తెలిపింది. వైసిపి నాయకులు, స్థానిక ఎమ్మెల్యే కనీసం ఆందోళన వైపు కన్నెత్తి చూడలేదు. రైతుల మెడపై రిజర్వు జోన్ కత్తి వేలాడుతోంది. వైసిపి ప్రభుత్వంపై రైతుల్లో అసంతృప్తి గూడు కట్టుకుని ఉంది. నేటికీ అది కొనసాగుతూనే ఉంది. రాజధాని ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి చేయకుండా మూడు రాజధానులంటూ అమరావతిని నిర్వీర్యం చేయడం వల్ల నియోజకవర్గంలో వైసిపిపై వ్యతిరేకత మరింత పెరిగింది. నాలుగేళ్లపాటు టిడిపి రాజధాని అనుకూల ఉద్యమాన్ని పెద్దఎత్తున నిర్వహించి వైసిపిపై వ్యతిరేకత పెంచేలా చేసింది. మంగళగిరి-విజయవాడ-గుంటూరు జంటనగరాలుగా అభివృద్ధికి అవకాశం ఉన్నా వైసిపి రాజధానిని నిర్లక్ష్యంగా చేయడం వల్ల తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొవాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి ఇంటి సమీపంలో తాడేపల్లి పట్టణం నుంచి బైపాస్‌రోడ్డు వెళ్లడానికి 70 ఏళ్ల క్రితం బకింగ్ హోమ్ కాల్వపై నిర్మించిన సింగిల్ లైన్ బ్రిడ్జిను డబుల్ లైన్ బ్రిడ్జిగా నిర్మించలేకపోయారు. పట్టణ ప్రజల్లో అసంతృప్తి నెలకొని ఉంది. స్వయానా ముఖ్యమంత్రి హెలీప్యాడ్‌కు వెళ్లడానికి ఈ బ్రిడ్జి మీదగానే రాకపోకలు సాగిస్తారు. తాడేపల్లి బైపాస్‌రోడ్డు ప్రాంతం శరవేగంతో అభివృద్ధి చెందుతుంది. రాకపోకలు కూడా పెరిగాయి. డబుల్ లైన్ బ్రిడ్జి అత్యంత అవశ్యం. సిఎం నివాసానికి కూత వేటు దూరంలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం కాకపోవడం పట్ల పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెత్త పన్ను, ఇంటి పన్ను పెరుగుదలతో పాటు కరెంటు ఛార్జీల బాదుడు ప్రభుత్వంపై అసంతృప్తికి కారణమయ్యాయి. ఓడిపోయినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా నారా లోకేష్ గత ఐదేళ్లుగా ప్రజలతో సంబంధాలు కొనసాగించారు. అయితే జనసేనతో పాటు బిజెపితో కలిసి టిడిపి పొత్తుకు వెళ్లడంతో ముస్లిం, మైనార్టీ, దళితుల ఓట్లు దూరమవుతాయనే చర్చ నడుస్తుంది.





అయితే ఈ నియోజకవర్గంలో వామపక్షాలు బలంగా ఉన్నాయి. 1985 తరువాత టిడిపి గెలిచిన పరిస్థితి లేదు. 2014 వరకు కాంగ్రెస్, వామపక్షాలే కీలక భూమిక పోషించాయి. కాంగ్రెస్, వామపక్షాలు కలిసి గణనీయమైన ఓట్లుసాధిస్తాయని ప్రచారం ఉంది. దీంతో టిడిపి, వైసిపి అభ్యర్థుల గెలుపుపై కొంత ప్రభావం పడనుంది. ఏ తరగతి ఓట్లు ఎక్కువగా ఇండియావేదిక అభ్యర్థి జొన్నా శివశంకర్ చీల్చుకుంటారో దానిని బట్టి ఫలితాలు నిర్ణయం కానున్నాయి.

ప్రకృతి వనరు ఇసుకను ఉచితంగా ఇవ్వాలి

దుగ్గిరాల మండలంలో సిపిఎం అసెంబ్లీ, సిపిఐ పార్లమెంట్ అభ్యర్థులు జొన్నా శివశంకరరావు, జంగాల అజయ్‌కుమార్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాలలో అభ్యర్థుల ప్రచారం

సమస్యలను తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని మంగళగిరి నియోజకవర్గ ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్ అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలో శనివారం గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా జొన్న శివశంకర్ మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి కషి చేస్తామన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో యంత్రాలతో కాకుండా మాన్యువల్‌గా ఇసుక త్రవ్వకాలు చేపట్టాలని యంత్రాలతో ఇసుక క్వారీలు త్రవ్వినట్లయితే భూగర్భ జలాలు అడుగంటుతాయన్నారు. నది పరివాహక గ్రామాలలో తాగునీటి సమస్య ఉన్నదని వ్యవసాయ పంపుసెట్లలో సైతం నీరు రావడంలేదని తెలిపారు. ప్రకృతి అందిస్తున్న ఇసుక ప్రజలకు ఉచితంగా ఇవ్వాలన్నారు. దుగ్గిరాల గ్రామానికి తూర్పు వైపున ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రస్తుతం కొల్లిపర మండలంలోని మున్నంగి సబ్ స్టేషన్ నుండి కరెంటు మోటార్లకు విద్యుత్‌ను అందిస్తున్నారని, రు దీని వలన అనేక సమస్యలు ఉత్పన్న అవుతున్నాయని తెలిపారు. హై లెవెల్ ఛానల్ కు కోటి రూపాయలు వెంటనే శాంక్షన్ చేయించి ఈ ప్రాంతంలో రైతాంగానికి సాగునీరు సమస్య పరిష్కరించే ఏర్పాటు చేస్తామన్నారు. డెల్టా కాలువల షట్టర్లు మరమ్మతులకు కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి తనను అసెంబ్లీకి జంగాల అజయ్ కుమార్ ను పార్లమెంటుకు పంపించాలని ప్రజలను కోరారు.సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల మోడీ పరిపాలనలో దేశం ఆర్థికంగా పారిశ్రామికంగా సామాజికంగా రాజకీయంగా పతనావస్తకు చేరిందన్నారు. దేశ లౌకిక వాదానికి పెనుముప్పు ఏర్పడినదని మొదటి విడత ఎన్నికల్లో బిజెపి ఓటమి నిర్ధారణ అయిందని అందువలన దేశంలో మత ఉద్వేగాలు రెచ్చగొట్టే నీచానికి మోడీ దిగజారాడని, రాజ్యానికి తూట్లు పొడుస్తూ మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. బిజెపి అంటేనే నేరచరిత్రలు నేరచరితులు అంటేనే బీజేపీ అని ఎద్దేవా చేశాడు. తాను గెలిచినట్లయితే అమరావతి రాజధాని పసుపు రైతుల సమస్యలు గుంటూరు జిల్లా సమస్యలను పార్లమెంటులో గళం ఎత్తుతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ నాయకులు ఎం శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, జెట్టి బాలరాజు ఎన్ యోగేశ్వరరావు వై బ్రహ్మేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి, తాడేపల్లి రూరల్ మండలంలో ప్రచారంలో సిపిఎం నాయకులు

కమ్యూనిస్టులను గెలిపించాలని సిపిఎం శ్రేణుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి :పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే రానున్న ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య అన్నారు. శనివారం మంగళగిరి పట్టణంలోని 30, 31 వార్డుల్లో ఇండియా బ్లాక్ వేదిక తరపున సిపిఎం అభ్యర్థిగా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న శంకరరావును, గుంటూరు పార్లమెంటు సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్ లను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం జరిగింది. ఇంటింటికి ఓట్లను అభ్యర్థించారు. ఆంధ్ర రాష్ట్రంలో బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి జనసేన పార్టీలను, లోపాయికారిగా పొత్తు పెట్టుకున్నా వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, నాయకులు ఏడుకొండలు, ఈ కాటమరాజు, ఏ నికల్సన్, షేక్ కాసిం షహీద్, కే హనుమంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం సీనియర్ నాయకులు జెవ రాఘవులు, పి బాలకృష్ణ అన్నారు. శనివారం రాజీవ్ గృహకల్పలోని మగ్గాల షెడ్డుల్లో ఇండియా బ్లాక్ వేదిక తరపున సిపిఎం, సిపిఐ అభ్యర్థుల్ని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కావాలంటే సుత్తి కొడవలి నక్షత్రం, కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కె మల్లికార్జునరావు, ఎం మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి రాజకీయాలను ప్రోత్సహించండి

ప్రజాశక్తి-తాడేపల్లి : అవినీతిరహితంగా ప్రజలకు సేవ చేసే రాజకీయాలను ప్రోత్సహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, ఐద్వా రాష్ట్ర నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి కోరారు. శనివారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో తాడేపల్లి సెంటర్‌లోని వివిధ ప్రాంతాల మహిళలతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు కులమతాలకు అతీతంగా ముందుకు సాగాలన్నారు. ఐదు సంవత్సరాల ఓటు విలువ తలరాత మారుస్తుందని అన్నారు. గత పది సంవత్సరాల బిజెపి పాలనలో మనుషుల మధ్య మతాల పేరుతో చిచ్చు పెట్టి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.మణిపూర్ మారణకాండంపై ఇప్పటి వరకు ప్రధాని మోడీగానీ, రాష్ట్రంలోని జగన్, ప్రతిపక్ష నాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ నోరు విప్పకపోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు తన ఐదు సంవత్సరాల పాలనలో సింగపూర్ గ్రాఫిక్స్ చూపించారని, ప్రస్తుత సిఎం జగన్ రాజధాని అమరావతిని పక్కనపెట్టి మూడు రాజధానుల పల్లవి ఎత్తుకుని రాష్ట్రాన్ని తిరోగమన దశలో పయనింపజేశారని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావుకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై, పార్లమెంట్ సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్‌కు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేయాలని కోరారు. సమావేశంలో విజ్ఞాన కేంద్రం బాధ్యులు గాదె సుబ్బారెడ్డి, ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు దొంతిరెడ్డి విజయలక్ష్మి, పి.గిరిజ పాల్గొన్నారు. సిపిఐ, సిపిఎం అభ్యర్థుల్ని గెలిపించాలని కోరుతూ తాడేపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. క్రిష్టియన్‌పేట, సుందరయ్య నగర్, డోలాస్‌నగర్ అంబేద్కర్ కాలనీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు, డివి భాస్కరరెడ్డి, డి.యోహాన్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : సార్వత్రిక ఎన్నికలలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఇండియా కూటమి వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శనివారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి లో సిపిఎం నాయకులు ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు బి ముత్యాలరావు, సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కష్ణ, కంచర్ల సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు కుంచనపల్లి లో వామపక్ష అభ్యర్థుల రోడ్ షో

ఇండియా బ్లాక్ కూటమి వామపక్ష అభ్యర్థులైన , మంగళగిరి శాసనసభ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు, సిపిఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌లతో ఆదివారం కుంచనపల్లి లో సిపిఎం ఆధ్వర్యంలో రోడ్డు షో కార్యక్రమాన్ని సాయంత్రం ఐదు గంటలకు కాజా వెంకటేశ్వరరావు కారు షెడ్డు వద్ద నుండి ప్రారంభం కానుందని సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శిలు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు.

మాట్లాడుతున్న సూర్యారావు

తాడేపల్లిలో ప్రచారంలో నాయకులు

మంగళగిరి చేనేత మగ్గాల షెడ్లో ఎన్నికల ప్రచారంలో నాయకులు

నవరత్నాల కంటే మెరుగైన పథకాలు : కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జగన్మోహన్‌రెడ్డి జైలుకు పోయే సమయం ఆసన్నమైందని ఎన్‌డిఎ కూటమి తరుపున సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో కోడికత్తి, వివేకానందరెడ్డి హత్యను అడ్డం పెట్టుకొని గెలిచారని, ఇప్పుడు రాయిదాడి నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. జగన్ నిజస్వరూపం తెలిసిన జనం ఆయన్ను ఓడించేందుకు సిద్ధమయ్యారన్నారు. అరాచక పాలన అంతం కూటమి పంతం నినాదంతో ఎన్‌డిఎ ఛార్జిషీట్ విడుదల చేసిందని అన్నారు. కూటమి అధికారంలోకి వస్తే నవరత్నాలు కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ఎం.శివనాగమల్లేశ్వరావు, జనసేన నాయకులు టి.భావన్నారాయణ పాల్గొన్నారు.

కట్టమూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కట్టమూరులో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు ఎన్‌ఆర్‌ఐ మందడి శ్రీహరి నేతృత్వంలో కాటూరి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మాగలూరి భానుప్రకాష్ ప్రారంభించారు. 400 మందికిపైగా బిపి షుగర్ గుండె, శ్వాస కోస, ఊపిరితిత్తులు, కళ్లు, ముక్కు, చెవి, గొంతు, ఎముకలు, కీళ్ల వ్యాధులపై పరీక్షలు చేసి మందులు అందించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం మాజీ అధ్యక్షులు ఎం.మోహన్ కృష్ణ, కె.రవికిరణ్, స్థానికులు శివప్రసాద్, మల్లికార్జునరావు, నరేష్, శ్రీనివాసరావు, బాబు, సురేష్ పాల్గొన్నారు.

రైల్వేలైన్ సాధన ఉద్యమానికి ఫోర్‌కార్నర్స్ అధినేత డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్ మద్దతు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేటకు రైల్వేలైన్ అత్యవసరమని, దీనికోసం జరుగుతున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రముఖ స్వచ్ఛంధ సేవాసంస్థ ఫోర్ కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్.బర్నబాస్ అన్నారు.

చిలకలూరిపేట రైల్వేలైన్ సాధన సమితి కన్వీనర్ షేక్ సుభాని శనివారం బర్నబాస్‌ను కలసి రైల్వేలైన్ ఏర్పాటు కోసం జరుగుతున్న ఉద్యమ కార్యాచరణను వివరించారు. గతం నుంచి ఎంతో మంది రైల్వేలైన్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారని, మంచికోసం చేసే ప్రయత్నంలో తాను భాగస్వాముడ్ని అవుతానని బర్నబాస్ హామీఇచ్చారు.

తాగునీటి కోసం మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - మాచర్ల

ఎస్సీ కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని శనివారం ఉదయం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మహిళలు, పిల్లలు, బిందెలతో కార్యాలయాన్ని ముట్టడించారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు రూబెన్ మాట్లాడుతూ కాలనీలలో నీళ్లకు చాల ఇబ్బందిగా ఉందన్నారు. తమ కాలనీల పట్ల అధికారులు వివక్షత చూపుతున్నారని మండిపడ్డారు. మాచర్ల తిరునాళ్ల కావడంతో ఇళ్లకు బంధువులొచ్చారని, నీరు లేకపోతే ఎంతో ఇబ్బందిగా ఉంటుందో అధికారులు అర్థం చేసుకోవాలని మహిళలు కోరారు. పట్టణంలో చాలబోర్లు నీటి నిల్వలు తగ్గి కొద్దికొద్దిగా వస్తున్నాయని, అటువంటి సమస్య ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని ఇంజనీరింగ్ అధికారులు వారికి వివరించారు.

ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మతోన్మాద బిజెపిని, దానితో జతకట్టిన టిడిపి, జనసేన పార్టీలతోపాటు తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలని కాంగ్రెస్, వామపక్ష నాయకులు కోరారు. ఇండియా బ్లాక్ తరుపున గురజాల అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తియ్యగూర యలమందరెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని కరాలపాడు, తుమ్మలచెరువు, వీరాపురం, శాంతినగర్, ఆంజనీపురం, అయ్యప్ప నగర్ తదితర గ్రామాల్లో శనివారం ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువతకు ఉద్యోగాలివ్వకుండా మోసం చేసిందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని చెప్పారు. ప్రజా సమస్యలను విస్మరించి మత విద్వేషాలు రెచ్చగొడుతోందని, ఈ విధానాలను విమర్శించిన ప్రతిపక్ష పార్టీల నాయకులు, మేధావులను అక్రమ కేసుల్లో ఇరిగిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసినా వైసిపి, టిడిపి, జనసేన ప్రశ్నించడం లేదని, పైగా ఆ పార్టీతోనే అంటకాగుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వ రక్షణ కోసం, సమస్యల పరిష్కారం కోసం ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కారాలపాడులో సుదీర్ఘకాలం పాటు సిపిఐలో పనిచేసిన కాపర్తి వెంకటేశ్వర్లను పరామర్శించారు. ఆయా పార్టీల నాయకులు టి.శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వర్లు, షేక్ బాబు, మునీరు, లింగయ్య, లక్ష్మి, గోవిందు, కృష్ణ, కోటిరెడ్డి, లక్ష్మి, అంకమ్మ, సైదాబీ, శ్రీను. బాష, యోహాను పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికల ఏర్పాట్లను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బి.సర్వేశ్వర్ నరేంద్ర స్థానిక అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, పల్నాడు జెసి శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి శనివారం పరిశీలించారు. జెడ్‌పి బాలుర పాఠశాలలోని 3 పోలింగ్ కేంద్రాలను, కంభంపాడులోని 6 పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ కనీస సౌకర్యాల ఏర్పాట్లపై చర్చించారు. పోలింగ్ రోజున ఏర్పాటు చేయాల్సిన సైన్ బోర్డులు, సదుపాయాల గురించి సూచనలిచ్చారు. స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉన్న సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియమ్ హైస్కూల్‌ను పరిశీలించారు. ఆయనవెంట తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి, కమిషనర్ డి.వెంకటదాసు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పోలీసు అబ్జర్వర్ అజిత్ సింగ్‌ను మాచర్ల రిటర్నింగ్ అధికారి శనివారం కలిసి అసెంబ్లీ పరిధిలోని పరిస్థితులు వివరించారు.

'వైసిపి పాలన పట్ల ప్రజల్లో విసుగు'

ప్రజాశక్తి - నరసరావుపేట

వైసిపి పాలనపట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విసిగెత్తారని, ఈ ఎన్నికల్లో వారు వైసిపిని ఓడిస్తారని ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి.చెన్నకేశవులు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఓ హోటల్లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను జగన్‌మోహన్‌రెడ్డి దుర్వినియోగం చేశారని, కార్పొరేషన్ల పేరుతో ప్రజల్ని మోసం చేశారని అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు వైసిపి ద్రోహం :శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గిరిజనుల అభ్యున్నతికి దోహదం చేసే ట్రైకార్‌ను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఎన్‌డిఎ కూటమి తరుపున నరసరావుపేట టిడిపి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మాచర్ల మండలంలోని కొత్తపల్లి సమీపంలో గిరిజన ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గిరిజనుల యువతులకు పెళ్లి కానుకగా ఇచ్చే రూ.లక్షను వైసిపి ప్రభుత్వం నిలిపేసిందని, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా ఒక్క ఎస్టీకైనా శిక్షణిచ్చి ఉద్యోగం కల్పించకపోవడం దారుణమని అన్నారు. వైసిపి రద్దు చేసిన గిరిజనుల సంక్షేమ పథకాలను టిడిపి అధికారంలోకి వస్తే పునరుద్ధరిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అన్న హామీని వైసిపి విస్మరించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో టీచర్ పోస్టులన్నీ ఎస్టీలతోనే భర్తీ చేయాలని టిడిపి ప్రభుత్వం తెచ్చిన జీవోను సుప్రీం కోర్టు కొట్టి వేస్తే దానిపై జగన్ ప్రభుత్వం కనీసం అప్పీలుకు వెళ్లలేదన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించడంతోపాటు బ్యాక్‌లాక్ పోస్టులనూ భర్తీ చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో ధారు నాయక్, ఎం.కల్లయ్య, కోట నాయక్, కె.శివారెడ్డి, కె.దుర్గారావు, కేశవరెడ్డిపాల్గొన్నారు.

పాస్టర్లకు ఇళ్లు నిర్మిస్తాం

ప్రజాశక్తి - మాచర్ల

అర్హతున్న ప్రతి పాస్టర్‌కు గౌరవ వేతనాలు అందిస్తామని శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్థానిక నరిశెట్టి కళ్యాణమండపంలో పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన పాస్టర్లకు ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లు నిర్మిస్తామన్నారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పాస్టర్లపై జరుగుతున్న దాడులను కఠినంగా అణిచివేస్తామన్నారు. ప్రార్థన మందిరాల ఆధునీకరణకు నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. పి.ఆంజయ్య, వై.మల్లికార్జునరావు, కె.దుర్గారావు, వై.కేశవరెడ్డి, పుల్లారావు, ఆనందరావు, చంద్రపాల్, చంద్రయ్య, సుందరరావు, వాసు పాల్గొన్నారు.

గిరిజన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు

అధికార పార్టీకి ఆదినుండీ ఆవరోధాలే

- అభ్యర్థి స్థానికేతరుడనే భావన
- వలసలతో తలనొప్పులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానికేతర అనే భావన, నాయకుల మధ్య సమన్వయ లోపం వెరసి చిలకలూరిపేటలో వైసిపికి అవరోధంగా మారాయి. ఇక్కడ పోటీ చేస్తున్న ఆ పార్టీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడుకు ఈ ఎన్నిక ఎదురీతలా ఉంది. తొలుత అభ్యర్థి మార్పు వద్ద నుండీ వైసిపి అధిష్టానం చర్యలు క్షేత్రస్థాయిలో ఫలితాలేమీ ఇవ్వడం లేదు. పైగా అంతర్గతంగా ఉన్న ఫిర్యాదులనూ పరిష్కరించకపోవడంతో ఆ పార్టీ నాయకులు, శ్రేణులు గందరగోళంలో ఉన్నారు.

ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి విడదల రజినిని గతేడాది డిసెంబర్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి మార్పు చేసి ఆమె స్థానంలో మల్లెల రాజేష్ నాయుడును సమన్వయకర్తగా నియమించారు. ఆయన కొద్దిరోజులు ప్రచారం చేసుకున్నాక ఆయన్ను తొలగించి గుంటూరు మేయర్‌గా ఉన్న మనోహర్ నాయుడును నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఇటీవల ఆయన నామినేషన్ కూడా దాఖలు చేశారు. అయితే రాజేష్‌నాయుడును తొలగించడం స్థానికంగా కలకలం రేగింది. ఆయనతోపాటు పలువురు వైసిపి కౌన్సిలర్లు వైసిపిలో చేరడం రాష్ట్ర వ్యాప్తంగానూ చర్చకు దారితీసింది. ఇదే క్రమంలో ఆయన మంత్రి విడదల రజినిపై ఆర్థిక అంశాలపై

తీవ్ర ఆరోపణలు చేశారు.

మరోవైపు మనోహర్ నాయుడును అభ్యర్థిగా ప్రకటించడమూ ఆ పార్టీ శ్రేణుల్లో కొంత అసంతృప్తికి కారణమైంది. గుంటూరు నాయకులు వచ్చి తమపై పెత్తనం చేయ డం ఏమిటని కొంతమంది అంటీముట్టనట్లు ఉంటున్నారు. దీంతో ఆ పార్టీ ప్రచారం అనుకున్నంత ఊపుగా లేదు. మరోవైపు పలువురు నాయకులు టిడిపిలో చేరడం వైసిపి సీనియర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

2019 ఎన్నికల్లో విడదల రజిని సామాజిక తరగతి, ఆమె భర్త సామాజిక తరగతివారు ఎక్కువగా వైసిపి వైపు మొగ్గు చూపడం, టిడిపిపై ఉన్న సాధారణ వ్యతిరేకత వెరసి రజినికి విజయాన్ని తెచ్చిపెట్టాయి. గత ఎన్నికలప్పుడు నియోజకవర్గంలో రెండు లక్షల 23 వేల 976 ఓట్లు కాగా రజిని 94 వేల 430 ఓట్లు సాధించి 8,301 మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఓటర్లు రెండు లక్షల 25 వేల 286 మంది ఉన్నారు. గతంకంటే 1310 ఓటర్లు పెరిగారు. గత ఎన్నికలప్పుడు పురుషోత్తపట్నంలో ఏకోన్ముఖంగా వైసిపి వైపు నిలబడింది. ఇప్పుడు వారంతా టిడిపివైపు మొగ్గారు. గతంలో రజినికి మద్దతుగా ఉన్న ఆమె సామాజిక తరగతి వారు ప్రస్తుతం కొంతమంది టిడిపి వైపు వెళ్లారు. ఈ అంశాలన్నీ తాజా ఎన్నికల్లో వైసిపికి సవాలుగా మారాయి.

గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆదినారాయణ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ పౌరాణిక, పద్య నాటక కళా కారుడు, నంది పురస్కార గ్రహీత ఆరాధ్యుల ఆదినారాయణ ఇంట ర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆదినారా యణ కళాకారుడే కాకుండా పౌరా ణిక పద్య నాటకాలకు దర్శకులుగా, హార్మోనిస్టుగా గుర్తింపు పొందారు. పట్టణంలోని శ్రీ దుర్గా భవాని నాట్యమండలి వ్యవ స్థాపకులు కూడా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఆఫ్ బెస్ట్ యాక్టర్ విభాగంలో ఇంటర్నేషనల్ పీస్ యూనివర్శిటీ నుంచి శనివారం గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్లు చెప్పారు. ఊటీలో జెం పార్కులో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో ఆయనకు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. డాక్టర్ ఎ. గోపికన్నన్, డా. జార్జ్ పీటర్, ప్రొఫెసర్ చల్లాదురై, డాక్టర్. రావ్ మయ్ హేని, డాక్టర్. యం. భానుప్రియ, డాక్టర్. యం. ఖాధిర్ వంటి ప్రముఖుల చేతుల మీదుగా గౌరవ్ డాక్టరేట్ ను ఆదినారాయణ అందుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా పౌరాణిక నాటకాలలో శ్రీకష్ణుడు, శ్రీరాముడు, నారదుడు, వేమన, భక్త తులసీదాసు తదితర పాత్రలను పోషించానని, వందల పర్యాయాలు ప్రదర్శ నలు ఇచ్చిన నేపథ్యంలో ఆయనకు ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న ఆదినారాయణను పట్టణ రంగస్థల కళా కారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్య నారాయణశెట్టి, జి.సుబ్బారావు, కోశాధికారి బి.జయలక్ష్మి, కళాకారులు ఎ.వేంకటేశ్వరరావు, ఎ.కోటేశ్వరరావు, ఎ. నాగరాజు, సిహెచ్ ఫణి కుమార్, ఆర్ అండ్ బి రాజు, బి.వెంకట్, డాక్టర్. ఎ. మల్లేశ్వరరావు అభినందించారు.

డా క్టర్ ఆదినారాయణను డాక్టరేట్ తో సత్కరిస్తున్న యూనివర్సిటీ బృందం

ముమ్మరంగా అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి - కొల్లిపర

నవరత్నాల పేరుతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తెనాలి అసెంబ్లీ వైసిపి అభ్యర్థి అన్నాబత్తిని శివకుమార్ అన్నారు. శనివారం కొల్లిపర మండలంలోని చక్రాయపాలెం, జెముడుబాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసిపికి ఓటు వేసి నన్ను గెలిపించాలని అన్నారు.

కొల్లిపర మండల గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న అన్నా బత్తుని శివకుమార్

ప్రజాశక్తి-తాడేపల్లి : వైసిపి మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య, పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక నులకపేటలో 13వ వార్డు మాజీ కౌన్సిలర్ మహమ్మద్ గోరేబాబు ఆధ్వర్యంలో కృష్ణనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి పథకాలను ప్రజలకు వివరించారు. తాడే పల్లిలో కూడా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి మేనిఫెస్టోపై టిడిపి విమర్శలు దారుణ మన్నారు. ప్రజలు మెచ్చే మేనిఫెస్టో జగన్ ఇచ్చారన్నారు. ఆయా ప్రచారాల్లో వైసిపి నాయకులు సుభాని, మస్తాన్, షఫీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే రానున్న ఎన్నికల్లో వైసిపికే ఓట్లు వేయాలని మంగళగిరి నియోజకవర్గం వైసిపి అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. స్థానిక ఒకటో వార్డులో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కాండ్రు కమల, వైసిపి నాయకులు ఎం.మల్లేశ్వరరావు, ఎం.సుధారాణి పాల్గొన్నారు.

మంగళగిరిలోని 21వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మురుగుడు లావణ్య

తాడేపల్లిలోని కృష్ణనగర్‌లో వైసిపి ప్రచారం

అనారోగ్యంతో ఆశా వర్కర్ మృతి

ప్రజాశక్తి-పెదనందిపాడు

మండలంలోని అబ్బినేని గుంటపాలెం గ్రామానికి చెందిన ఆశా వర్కర్ పాపిశెట్టి భవాని(46) శనివారం ఉదయం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించిన సిఐటియు మండల అధ్యక్షులు ఫణిదపు భువనేశ్వరి, మండల నాయకులు మర్రి లక్ష్మి, షేక్ షమీ, జ్యోతి కుమారి నివాళులర్పించారు. సిఐటియు మండల బాధ్యులు డి.రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.వెంకట శివరావు సంతాపం తెలిపారు.

భవాని భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉండవల్లిలో అమరావతి రైతుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి : రాష్ట్ర రాజధానిగా ఎవరైతే అమరావతిని నిలుపుతారో వారికే ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ శనివారం సాయంత్రం ఉండవల్లిలో అమరావతి రైతులు ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు మాట్లాడుతూ అమరావతి రాష్ట్ర రాజధానిగా ఉండాలంటే సరియైన నాయకుడైన చంద్రబాబుని గెలిపించుకోవాలని అన్నారు. అమరావతికి భూములు ఇచ్చి నష్ట పోయామని రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని అన్నారు. ఈ కార్య క్రమంలో జంగాల సాంబశివరావు, జంగాల వెంకటేష్, అమరా సుబ్బారావు, లింగం శెట్టి కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

'గుంటూరు పేరు ఇండియా మొత్తం వినపడేలా చేస్తా'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అవినీతి రహితంగా గుంటూరును అభివృద్ధి చేస్తామని టిడిపి లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. గుంటూరులోని తూర్పు నియోజకవర్గంలో గల 6, 57 డివిజన్లలోని సుమారు 350 మంది వైసిపి కార్యకర్తలు శనివారం టిడిపిలో చేరారు. పార్టీలో చేరుతున్న వారిని పెమ్మసాని చంద్రశేఖర్ టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గుంటూరు పేరును ఇండియా మొత్తం వినపడేలా చేస్తానన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉండి కూడా రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించ లేకపోయిన వైసిపి ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. గంజాయి, గుట్కాలు అమ్ముకున్న ఎమ్మెల్యే బాగుపడ్డారని, ప్రజలు మాత్రం ఇబ్బందుల పాలవుతున్నా రని అన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక రెండు సెంట్లలో ఇళ్ల నిర్మాణం లేదా టిడ్కో ఇళ్లు అందజేత ద్వారా పేదలకు నివాస సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నిరుద్యోగ సమస్యను తరిమికొట్టే విధంగా ఇండస్ట్రీలు తెస్తామని, ఇంటి నుంచి బయటకు రాలేని మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యేలు నంబూరు సుభాని, రావి వెంకటరమణ, తూర్పు నియోజకవర్గ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మహమ్మద్ నశీర్ అహ్మద్, టిడిపి నాయకులు భరత్ రెడ్డి, ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన కార్యకర్తలతో పెమ్మసాని చంద్రశేఖర్

అంబటి అవినీతిని ప్రజలముందు ఉంచుతా

ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ధ్వజం

ప్రజాశక్తి- పొన్నూరు

పొన్నూరు నియోజకవర్గ వైసిపి అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణపై, ఆయన అన్న అన్న, మంత్రి అంబటి రాంబాబుపైటిడిపి,జనసేన,బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపణలు, విమర్శలు చేశారు. శనివారం చింతలపూడిలోని డివిసి కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూమ రాంబాబు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రాజ్యాంగేతర శక్తిగా మారి అన్ని వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని పెత్తనం చెలాయించారని అన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్నానంటూనే సత్తెనపల్లిలో రాజకీయం నడిపింది అంబటి మురళీ కాదా?తన అన్న అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రభుత్వ కార్యక్రమాల్లో మురళీకృష్ణ పాల్గొనలేదా? అని ప్రశ్నించారు. మురళీకృష్ణ తాను అమాయకుడినంటూ పొన్నూరు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన అవినీతి, దోపిడీ పర్వాన్ని ప్రతి రోజూ ప్రజల ముందుంచుతానని అన్నారు.

29న నామినేషన్ల ఉపసంహరణ చివరి గడువు

ప్రజాశక్తి- పొన్నూరు

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రభుత్వ సెలవు దినములలో ఉపసంహరణ చేసే అవకాశం లేదని పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ. లక్ష్మీకుమారి శనివారం తెలిపారు. నామినేషన్లు ఉపసం హరించుకునే అభ్యర్థులు ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలు లోగా సరైన ప్రొ ఫార్మాలో దాఖలు చేసుకోవాలని చెప్పారు.

విజయాహెల్త్ కేర్ ట్రస్ట్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మంగళగిరి

అనారోగ్యంతో బాధపడుతున్న పసికందు వైద్య ఖర్చుల నిమిత్తం విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి గౌడ్ ఆర్థిక సాయం చేశారు. విజయవాడకు చెందిన నాగమణి అనే మహిళకు పెళ్లి తర్వాత ఇరవై ఏళ్లకు ఒక మగ బిడ్డ అతి తక్కువ బరువుతో (ఎనిమిది వందల గ్రాములు) పట్టిన పసికందుకు ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడంతో ఐసియులో నెల రోజులు వైద్యం అందించాలని, ఎక్కువ డబ్బు ఖర్చవు తుందని వైద్యులు తెలిపారు. అయితే, అంత ఆర్థిక స్తోమత తమకు లేదని బిడ్డ తల్లిదండ్రులు విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ని సహాయం కోరారు. ఈ నేపథ్యంలో పసికందు ఆరోగ్య పరిస్థితి హాస్పిటల్స్ సిబ్బంది ద్వారా తెలుసుకున్న ట్రస్ట్ ఫౌండర్ కాగి తాల స్వాతి గౌడ్ బాబు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం హాస్పటల్ వారికి రూ.20 వేల ఆర్థిక సాయం దాతల సహాయంతో శనివారం అందజేశారు.

ఆర్థిక సహాయం అందిస్తున్న స్వాతి

పోస్టల్ బ్యాలెట్ గడువు పెంపుపై హర్షం

ప్రజాశక్తి-గుంటూరు

సాధారణ ఎన్నికలలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఫామ్-12 సమర్పించేందుకు మే 1వ తేదీ వరకు సమయం ఇచ్చినందుకుగాను రాష్ట్ర ఎన్నికల అధి.కారికి, జిల్లా ఎన్నికల అధికారికి ఏపీ ఎన్జీజిఓ అసోసియేషన్ నాయకులు ధన్యావాదలు తెలిపారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ప్రతి ఉద్యోగి వారు పనిచేస్తున్న నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలని, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే రోజు ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని కోరారు.

శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాగరాజు

అత్యుత్తమ ఫలితాల 'వైష్ణవి'లో అందుబాటు ఫీజులు

ప్రజాశక్తి-తెనాలి

పేద,బడుగు, బల హీనవర్గాల విద్యార్థులకు అందుబాటులో ఉండే ఫీజు లతో అత్యుత్తమ ఫలి తాల ను సాధిస్తున్న ఏకైక సంస్థ వైష్ణవి జూని యర్ కళాశాల అని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షులు పి.నాగరాజు అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు లోని వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావును వివిధ విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి శనివారం సత్కరించారు. నాగరాజు మాట్లాడుతూ వైష్ణవి జూనియర్ కళాశాల ఆవిర్భావం నుంచి ఎంతోమంది పేద విద్యార్థులకు బాసటగా నిలిచిందని, తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ అత్యుత్తమ ఫలితాలను సాధించడంలో కీలకంగా ఉందని చెప్పారు.

ఐఎస్ఎ అధ్యక్షులుగా రోహిత్ శ్రీసాయి

ప్రజాశక్తి-గుంటూరు

అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ మసాచుసెట్స్, యూనివర్శిటీకి సంబంధించి ఇండియన్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు (ఐఎస్ఎ) జరిగిన ఎన్నికలలో రాష్ట్రానికి చెందిన రోహిత్‌శ్రీ సాయి బాచిన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విదేశీ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలలో భారత్‌కు చెందిన అందులోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థి ఎన్నికవ్వడం పట్ల పలువురు అభినందనలు తెలియచేస్తున్నారు. రోహిత్ శ్రీ సాయి బాచిన అద్దంకి నియోజకవర్గంలోని జె.పంగలూరు గ్రామం, వీరి తండ్రి బాచిన హనుమంతరావు కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విధులు నిర్వహిస్తున్నారు. బాచిన రోహిత్ శ్రీ సాయి 75 శాతం ఓట్ల శాతంతో విజయం సాధించారు. రోహిత్ ఎన్నిక పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళ్లం కాలేజి అధ్యాపకురాలికి డాక్టరేట్

మాధవిని అభినందిస్తున్న ఉమాశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కాలేజి, కెరీర్ గైడెన్స్ విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకురాలు బి.మాధవికి జెఎన్‌టియు హైదరాబాద్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ యం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు.మాధవి 'డిగ్రీ ఇన్‌ది కాంటెంపరరీ ఇండియన్ ఇంగ్లీష్ లిటరేచర్' అనే అంశంపై పరిశోధన చేశారని, ఆమెకు జెఎన్‌టియు అధ్యాపకురాలు డాక్టర్ పి.అపర్ణ గైడ్‌గా వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా మాధవిని ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, కెరీర్ గైడెన్స్ విభాగాధిపతి డాక్టర్ పిఎల్ మాధవరావు, అధ్యాపకులు అభినందించారు.

ఒకటో తేదీ వరకూ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల విధులు కేటాయించబడిన శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగంకు మే 1వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు జిఎంసి అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున అర్హులు అందరూ వినియోగించుకోవాలని కోరారు. అదర్ పోలింగ్ ఆఫీసర్స్ (ఓపిఓ)గా ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, అంగన్వాడీలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను మే 1 వరకు దరఖాస్తు చేసుకునేలా గడువు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్‌లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. హెల్ప్‌డెస్క్ సిబ్బంది కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రాజ్యలక్ష్మి

ఎన్నికల సిబ్బందితో జిఎంసి అడిషనల్ కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు : ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిఎంసి అదనపు కమీషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం పశ్చిమ నియోజకవర్గంలోని ఈ.వి.యం కమిషనింగ్ టీం, రిసెప్షన్ టీం, డిస్ట్రిబ్యూషన్ టీంలతో జిఎంసి కౌన్సిల్ హాల్లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్.ఓ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎన్నికల నిబంధనల మేరకు కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పశ్చిమ నియోజకవర్గంలోని 291 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ పంపిణీకి 32 టేబుల్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, అవసరమైన సిబ్బందిని కేటాయించటం జరిగిందన్నారు. ఈ.వి.యంల కమీషనింగ్‌కు కేటాయించబడిన సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా కమీషనింగ్ ఉంటుందని, సాంకేతి క బృందంతో సమన్వయం చేసుకు ంటూ ఉండాలన్నారు. సమావే శంలో ఏ.ఆర్.ఓ లు సి.హెచ్ శ్రీనివాసరావు, శీనా రెడ్డి, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ పాల్గొన్నారు.

నందివెలుగులో క్రికెటర్ అంబటి రాయుడు ప్రచారం

నందివేలుగు ఎన్నికల ప్రచారంలో క్రికెటర్ అంబటి రాయుడు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి, ప్రజాసేవ చెసేందుకు పార్టీలో చేరానని అంతర్జాతీయ మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. శనివారం జనసేన తరపున జరిగిన ఎన్నికల ప్రచా రంలో నంది వెలుగు గ్రామంలో ఎన్ని కల ప్రచారాన్ని ప్రారంభిం చారు. అనంతరం కొలక లూరు, హాఫ్ పేటలో పర్యటిం చారు. ఓటర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై స్థానికులతో చర్చించారు. అనంతరం అంబటి రాయుడు మాట్లాడుతూ ప్రస్తుత అధికార పార్టీలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కరువయ్యాయని కనీసం ఎమ్మెల్యేలు సిఎం ను కలవలేని పరిస్థితి నెలకొందని అన్నారు. యువత అభివృద్ధి పవన్ కళ్యాణ్ తో సాధ్యమవుతుందని అన్నారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన కావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలని ఓటర్లను కోరారు. యువతకు ప్రోత్సాహకాలతో పాటు, రైతులకు మంచినీటి సదుపాయాలకొరకు ఆయన చేస్తున్న పోరాటం సత్ఫలితాలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ఆయుధాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

ర్యాండమైజేషన్ ద్వారా పిఒ, ఎపిఒల కేటాయింపు

సిబ్బందిని కేటాయింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సాధరణ ఎన్నికలకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అదర్ పోలింగ్ అధికారులుగా నియమించిన ఉద్యోగులను అసెంబ్లీ నియోజకవర్గాల కేటాయి ంపునకు శనివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజక వర్గముల ఎన్నికల పరిశీలకులు నీరజ్ కుమార్, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైని) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి ఎన్ఐసీ పోర్టల్ ద్వారా రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఉత్తర్వులను జనరేట్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 1915 పోలింగ్ కేంద్రాలలో రిజర్వు సిబ్బందితో కలిపి పీవోలు గా 2300 మంది, ఏపీవోలుగా 2300 మంది, ఓపిఓలుగా 9200 మంది మొత్తం 13,800 మంది ఉద్యోగులకు విధులు నిర్వహించాల్సిన నియోజకవర్గాలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ ప్రశాంతం

ప్రజాశక్తి-గుంటూరు : పాలిటెక్నిక్ కాలేజిల్లో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పాలిసెట్- 2024 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరం, తెనాలి పట్టణంలో 14 సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 84.98 శాతం హాజరు నమోదు అయ్యింది. గుంటూరు నగరంలోని 11 పరీక్షా కేంద్రాల్లో 4632 మందికి గాను, 3908 మంది హాజరవగా, 724 మంది గైర్హాజరయ్యారు. అలాగే తెనాలిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 775 మందిక ిగాను 687 మంది హాజర య్యారు. మొత్తం 547 మందికిగాను 4595 మంది హాజరైనట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, నల్లపాడులోని ఎంబిటిఎస్ పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ టి.శేఖర్ తెలియజేశారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎపిజిఎల్ఐపై అవగాహన సదస్సు

మాట్లాడుతున్న పోతురాజు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని ఫెడరేషన్ కార్యాలయంలో శనివారం ఎపిజిఎల్ఐ-ఆన్‌లైన్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ ప్రారంభిస్తూ ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్న ఖాతాదారుల సమాచారం స్పష్టంగా లేదని, సవరించుకునే విధానం తెలియక టీచర్లు పెద్దఎత్తున ఆందోళన పడుతున్నారన్నారు. ఎపిజిఎల్ఐ జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ యం.పోతురాజు ఆన్‌లైన్ విధానంలో వివిధ రకాల దరఖాస్తులు ఏవిధంగా అప్లై చేయాలో వివరించారు. టీచర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సందేహాలు నివత్తి చేశారు. ప్రతి ఉద్యోగి తమ తమ ఖాతాలను పరిశీలించుకొని ఏవైనా లోపాలు ఉంటే ఆన్‌లైన్‌లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఇకనుండి పూర్తి సమాచారం ఖాతాదారుని చేతిలోనే ఉంటుందని అన్నారు. 3 గంటలపాటు సాగిన సదస్సులో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏ.ఎల్. శివపార్వతి, జిల్లా కోశాధికారి ఎం.డి.దౌలా, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, కె.కేదార్నాథ్, యం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్, కె.ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు

జగన్ మళ్లీ గెలిస్తే వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు ఉరి

వినుకొండ టిడిపి అభ్యర్థి జీవీ ఆంజనేయులు విస్తృత ప్రచారం

మీడియాతో మాట్లాడుతున జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో పొరపాటున జగన్ మళ్లీ గెలిస్తే వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు ఉరే అని, దొడ్డిదారిన మీటర్ల బిగింపునకు రంగం ఇప్పటికే సిద్ధం చేసిందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు తెలిపారు. శనివారం వినుకొండ 26వ వార్డులో కూటమి పార్టీ నాయకులతో కలసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడిన జీవీ ఆంజనేయులు జగన్ అయిదేళ్ల పాలన మొత్తం పూర్తిగా రైతు వ్యతిరేక నిర్ణయాలే అని, రైతులపై పడబోయే భారా లకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఈ విషయాలన్ని గమనించి రైతులంగా ఓటుతో జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతు ఎన్నికల మానిఫెస్టో గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. జే బ్రాండ్ల పేరిట నాసిరకం మద్యం సరఫరా చేసి 35 లక్షలమందిని ఆస్పత్రి పాలుచేసిన దుర్మార్గుడు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగానే ఎమ్మెల్సీ జంగా కష్ణమూర్తితో కలిసి జగనాసుర రక్తచరిత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేదలకు సెంటు భూమి దగ్గర కూడా మోసం చేశారని, తాము అధికారంలోని రాగానే రెండుసెంట్లు స్థలంలో సకల సౌకర్యాలతో పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. బొల్లాని 40 వేలకుపైగా మెజార్టీతో చిత్తుచిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

హామీలు అమలు చేసి తీరుతాం

గుంటూరు పశ్చిమ వైసిపి అభ్యర్థి విడదల రజని

శ్యామల్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న విడదల రజని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన ఘనత వైసిపికి దక్కుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. గుంటూరు శ్యామలానగర్, హౌసింగ్‌బోర్డు ప్రాంతాల్లో శనివారం ఆయా ప్రాంతాల్లో గడపగడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజినీ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేసి సిఎం జగన్ తన విశ్వసనీయత చాటుకున్నారని తెలిపారు. మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశారని వెల్లడించారు. మేనిఫెస్టోలో లేనివి కూడా అనేకం అమలు చేశారన్నారు. ఆ ధైర్యంతోనే మీకు మేలు జరిగిందని అనుకుంటేనే తనకు ఓటు వేయమని అడుగుతున్నానని వెల్లడించారు. ఓట్ల కోసం టిడిపి మాదిరిగా తప్పుడు వాగ్దానాలు చేయ లేదన్నారు. ఏదైతే అమలుచేయగలమో అదే చెబుతామని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాలి గిరి మాట్లాడుతూ విశ్వసనీయత లేని చంద్రబాబు, పవన్‌లు ఎన్ని వాగ్దానాలు చేసినా, ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా ప్రజలెవరూ నమ్మబోరని స్పష్టం చేశారు. తొలుత ఆమె 36 వ డివిజన్ పరిధిలోని శ్యామలానగర్‌లో పర్యటించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, వైసిపి నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, దుగ్గెంపూడి వెంకట్రామిరెడ్డి, ఉడుముల అప్పిరెడ్డి, షేక్ మియా సాహెబ్, ఇమామ్, వీరాస్వామి, మస్తాన్ వలి పాల్గొన్నారు. 28వ డివిజన్‌లో వెంకటరమణ కాలనీ, సంతోష్ నగర్, హౌసింగ్ బోర్డు ప్రాంతాల్లో పర్యటించారు. డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు రమేష్, నర్సిరెడ్డి, రమణారెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.